కథా నిలయం
3959
శ్రీకాకుళం

# అంకితం

పెదాలకే పరిమితమైన చిరునవ్వు, కృత్రిమ వాతావరణం, రోజుకో మారణహోమం... మెగాసిటీ కలకత్తా మూడేళ్ళకే మొహం మొత్తిందంటే నమ్మండి. దానికి తోడు అమ్మనుండి కమ్మని ఉత్తరం కూడా వచ్చింది.

'బాబూ! నా బంగారు కొండా ! కళ్ళు మూసినా తెరిచినా నువ్వే కనపడుతున్నావురా, ఒక్కగానొక్క కొడుకును మూడేళ్ళపాటు చూడకుండా ఎలా ఉండగలిగానో... నాకే అర్థం కావడంలేదు. ఇహ నా వల్లకాదురా, పెద్ద ఇంజనీరువై నంత మాత్రాన పెళ్ళి చేసుకోకుండా ఇంకెంత కాలముంటావ్? కొడుకూ కోడల్ని చిలకా గోరింకల్లా... కన్నుల పండువుగా చూడాలని ఏ తల్లిదండ్రులకుండదు ?

మూడో తారీఖా నాడు మాధవి పెళ్ళి. పత్రిక జత చేశాను. చూస్కో, నువ్వు తప్పక రావాలి. ఒంటిగా వచ్చి జంటగా వెళ్ళాలి. ఆశీస్సులతో... మీ అమ్మ... '

అమ్మ ఉత్తరం చదవగానే అంతరంగం అమృత సింధువైంది. ఈసారి తప్పక వెళ్ళాలి. నిర్ణయం జరిగిపోయింది.

రెండు నెలలు లీవు శాంక్షన్ చేయించుకున్నాను. ఫస్టు తారీఖునాడు జీతం అందుకుని... తియ్యని ఊహలతో బయలుదేరాను. అన్నట్టు... మాధవి అంటే ఎవరనుకున్నారు ? సాక్షాత్తు మా నగరేశం మావయ్య చిన్నకూతురు. మంజుల చెల్లి.

చిన్నప్పుడు... రెండు రోజులు సెలవులు దొరికితే చాలు... రెక్కలు కట్టుకుని రక్కున నంగునూర్‌లో వాలేవాణ్ని. అక్కడ మా అమ్మమ్మ, తాతయ్య, అత్తయ్య, నగరేశం మావయ్య నన్నెంతో అప్యాయంగా చూసుకునేవారు. బొద్దుగా, ముద్దుగా నడిచే నిర్మల్ బొమ్మలాగుండే మంజులతో బోలెడంత కాలక్షేపం. చెరువుగట్టు మీద చిర్రాగోనే, నగరేశ్వరాలయంలో దాగుడు మూతలు ఆడుకునేవాళ్ళం. ఇంట్లోనైతే అష్టచెమ్మ... పొద్దెట్లా గడిచిపోయేదో ! మాధవి కూడా మాతో ఆడుకునేది. 'బావా ! నువ్వు మా అక్కను చేసుకుంటావా, నన్నా ?' అని అడిగేది. 'ఒసేయ్ నువ్వు చిన్నపిల్లవే !' అని నెత్తిమీదో మొట్టికాయిచ్చేది మంజుల - పెద్దమనిషిలా -

మంజుల ఇంటర్ పాసై సంవత్సరమైంది. ఎంసెట్లో రాంకు రాలేదు. ఇంకో సంవత్సరమైతే గాని నాకు ఇంజనీరింగ్ డిగ్రీ రాదు. సెలవుల్లో ఇంటి వద్దే ఉన్నాను. అనూహ్యంగా నగరేశం మావయ్య, అత్తయ్య, మంజులతో దిగాడు. భోజనాలయ్యాక మావయ్య వక్కపొడి నములూ్తా అమ్మతో అన్నాడు.

'అక్కయ్యా ! మంజులకు పెళ్ళీడొచ్చింది. దాన్ని నీ ఇంటి కోడలిగా చేసుకోవే. సంబంధం ఇప్పుడు ఖాయం చేసెయ్. పెళ్ళి మీరెప్పుడంటే అప్పుడే చేద్దాం.'

ఇప్పుడే సంబంధం ఖాయమైతే నా మనసంతా మంజుల మీదుంటుంది గాని చదువు మీదుంటుందా ? ఇప్పుడు నా పెళ్ళి గురించి ఏమీ మాట్లాడొద్దని భీష్మించాను. వాళ్ళమ్మ పక్కనే

కూచుండి నావైపే దృష్టి సారించిన మంజుల చూపుల్లోంచి తప్పించుకోవడం కష్టమైంది.

'వానికిప్పుడే పెళ్ళి సంబంధమొద్దు' నాన్న నా మనోగతాన్నర్థం చేసుకున్నాడు. 'వాని చదువు పూర్తయి ఉద్యోగంలో చేరాలి. అంతవరకు ఎన్నేళ్ళవుతుందో ఏమో. ఖాయమైన పెళ్ళిని ఏళ్ళ తరబడి ఆపడమంటే పసిపాపకు చాక్లెటిచ్చి తినొద్దని బెదిరించినట్టు ఉంటుంది' తేల్చేశాడు. అత్తయ్య, మావయ్యలు జాయింట్‌గా వాదించినా ఫలితం రాలేదు.

తోడబుట్టిన అన్నయ్యను చిన్నబుచ్చలేక, ఇటు భర్తకి నచ్చజెప్పలేక, కన్నకొడుకుని సముదాయించలేక... ఆనాటి అమ్మ చూపులు గుర్తుకొచ్చినప్పుడల్లా నా మనసు మబ్బుపట్టిన ఆకాశంలా అయిపోతుంది. పాపం ! అమ్మ...

కలకత్తా కొచ్చిన సంవత్సరం లోగానే మంజుల పెళ్ళి పత్రికొచ్చింది. భర్త డిఫెన్స్‌లో పనిచేస్తున్నాడట. నాకేమో కొత్త వాతావరణం, కొత్త ఉద్యోగం, ప్రొబేషన్ పీరియడ్. కాబట్టి వెళ్ళలేక పోయాను. ఇప్పుడు మాధవి పెళ్ళికి మంజు పతీసమేతంగా వస్తుంది కదా. సరదాగా ఉంటుంది. ప్రయాణం చేస్తున్నంతసేపు ఆలోచనలు కందిరీగల్లా ముసురుకున్నాయి.

తెల్లవారక ముందే వరంగల్‌లో రైలు దిగాను. మా ఊరు బస్సెక్కి కిటికి పక్కన కూచున్నాను. అప్పుడే చీకటి కాకులు ఎగిరిపోతుంటే వాతావరణం బూడిద వర్ణమైంది. బస్సు హసన్‌పర్తి బస్టాండ్‌లో ఆగింది. గాలి కోసం దిగాను. తూరుపు ఆకాశం అరుణ వర్ణమైంది. క్షణాల్లో ఎంత మార్పో ! బాలభానుని నునులేత కిరణాలు బస్సులకు బంగారు పూతలు పూస్తున్నాయి. మా బస్సు బయలుదేరిందప్పుడే. బస్సు ముందుకు పరుగెడుతోంది. పచ్చని చెట్లు వెనక్కు పరుగెడుతున్నై. పశువులు అడవి కెళ్తున్నాయి. పశువుల కాపరి దున్నపోతు మీదెక్కి పోతున్నాడు. అబ్బో ! ఇప్పుడు యమధర్మరాజు కాదు గదా... నవ్వొచ్చింది.

నంగునూర్‌లో బస్సు దిగేసరికి ఎనిమిదైంది. సూట్‌కేస్ పట్టుకొని చెరువు కట్ట మీద నడుస్తున్నాను. చల్లని గాలి... హాయిగా ఉంది. పూర్తిగా నిండిన చెరువు పూర్ణగర్భిణిలా ఉంది. నీటి మధ్యన విచ్చుకుంటున్న తామరపూలు అలల తాకిడికి ముద్దాడుకుంటున్నై. ఎదురుగా మెరుపు తీగలు. ముంగురుల్నీ, వికసించిన యవ్వనపు పొంగులమీద వోణీలను సవరించుకుంటూ వస్తున్నారు పడతులు. నవ్వులు కావవి పువ్వులు. మగపిల్లలు చెరువులో ఈదులాడుతున్నారు. ఆ పరిసరాలన్నీ నాకు సుపరిచితాలే. అయినా ఎదలో గిలిగింతలు.

చెరువు దాటగానే నగరేశ్వరాలయం. ఆలయం ముందు కాళ్ళు ఆటోమేటిగ్గా ఆగిపోయినై. సూట్‌కేసు నేల మీదుంచి దేవునికి నమస్కరించాను. కాస్సేపు తన్మయత్వం.

మావయ్యింటికెళ్లగానే వసారాలో అమ్మ కన్పించింది. ఎవరో అమ్మాయితో మాట్లాడుతోంది.

'అమ్మా ! పిలుస్తుంటే నా నవనాడులు పులకించాయి.

'బాబూ!' అంటూ ఆప్యాయంగా ఎదురొచ్చి అక్కున చేర్చుకుంది. అమ్మవొడి... ఎంత హాయి ! అమ్మతో మాట్లాడుతున్న యువతి అప్పుడే లోపలి కెళ్ళిపోయింది. అత్తయ్య, మావయ్యల పలకరింపులో ఆప్యాయత తగ్గలేదు.

'బాగున్నావా బావా !' పెళ్ళికూతురు మాధవి పలకరింపు తేనె జల్లులా ఉంది. తీర్చిదిద్దిన చందనపు బొమ్మలా ఉంది.

'ఆ... బాగున్నాను మధూ ! మంజుల బాగుందా ?' రొపేన అడిగేశాను.

'ముందు నువ్ స్నానం కానియ్ బావా !' అంది.

అంతా పెళ్ళి పనుల్లో ఉన్నారు. ఇంకా చుట్టాలంతా రానట్టుంది. నాన్న రేపు పెళ్ళి టయానికొస్తాడట. స్నానం కాగానే అమ్మ టిఫిన్‌కు రమ్మంది. నాలోని ఆరాటాన్ని ఆపుకోలేక పోయాను.

'మంజుల ఇంకా రాలేదామ్మా ?'

'అదేమిట్రా ? నువ్వొచ్చినప్పుడు నాతో మాట్లాడ్తుంది మంజులనే కదా గుర్తుపట్టలేదా ?'

'ఆమె... మం... మంజులనా ?'

'అవును ... నేనే బావా !' అంటూ మంజుల ప్రత్యక్షమైంది.

'అరె... మంజులా !' నోట్లో కెళ్ళాల్సిన ఇడ్లీముక్క చేతిలోనే ఉండిపోయింది. మంజుల... ఇదేమిటీ...

'నీ నుదురు బోసిబోయింది. మతిమరుపా లేక డిఫెన్సు ఫాషనా?' అడిగాను ఆశ్చర్యంగా.

'దాని సంగతి నీకింకా తెలీకపోవచ్చురా' అంది అమ్మ.

'మంజుల భర్త డిఫెన్స్‌లో పనిచేస్తున్నాడు కదా... అతడ్ని వెంటనే పరిచయం చేసుకోవాలమ్మా'

'అవును. అతడు డిఫెన్స్‌లోనే పనిచేసేవాడు. కానీ అతనితో పరిచయం అసంభవం బావా!' మంజుల గొంతులో ఆనాటి మంజీరనాదాలు లేవు. మొహం కడిగిన ముత్యంలాగుంది.

'నిజంరా !' అమ్మ చట్నీ వడ్డిస్తూ 'మంజుల భర్త కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి దేశం కోసం ప్రాణాలిచ్చాడురా' అంది.

'అమ్మా ... !' నెత్తిన పిడుగు పడ్డట్టయింది. నరాల్లో కాస్సేపు రక్తప్రసారం ఆగిపోయింది. నా గుండెల నెవరో మెలిపెట్టినట్టనిపించింది.

మంజులను ఈ స్థితికి తేవడానికి నా పాత్ర కూడా ఉంది కదూ. జీవితమంతా తోడూ నీడగా ఉంటానని వస్తే తోసి పారేశాను. భగవంతుడా ! నా పాపానికి నిష్కృతి ఉందా ? పాపభీతి మస్తిష్కాన్ని తొలిచేస్తుంటే చిన్ననాటి స్నేహితులను కలవాలన్పించలేదు.

మాధవి పెళ్ళైపోయింది. నా మనసులోని అల్లకల్లోలం అలాగే ఉంది. అదే రోజు మాధవి అత్తారింటికి వెళ్ళిపోయింది. వచ్చిన చుట్టాల్లో చాలామంది వెళ్ళిపోయారు. మిగిలిన కొందరు మాధవితో వెళ్ళారు. అమ్మా నాన్న కూడా వెళ్ళారు. పెళ్ళికొడుకు నన్ను రమ్మన్నాడు. సారీ చెప్పి తప్పుకున్నాను. పని మనిషి, నేను, మంజుల మిగిలాం. రాత్రంతా ఏవేవో ప్రశ్నలతో నా బుర్ర వేడెక్కింది.

నిండు యవ్వనంలో పండువెన్నెల పరుచుకోవాల్సిన మంజుల జీవితం మోడువారి పోవాల్సిందేనా ? పిల్లా పాపలతో కళకళలాడాల్సిన ప్రాయం... కడుపు పండకముందే కష్టాల పాలు

కావల్సిందేనా ? జంట కరవై ఒంటరి బతుకీడ్వాల్సిందేనా ? నో... నో... నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే.

మర్నాడుదయం...

'టిఫిన్‌కు రా బావా !' పిలిచింది మంజుల.

మనసు విప్పేందుకదే సమయం.

'మంజులా ! నీ కన్యాయం చేశాను కదూ'. అంటూంటే నా పెదాలు వణికాయి. చటుక్కున తలెత్తి నా కళ్ళలోకి చూసింది. నేనాగలేదు. 'అవును మంజులా ! అప్పుడే నిన్ను పెళ్ళాడేందుకు నేనొప్పుకుంటే నీ పరిస్థితి ఈ విధంగా ఉండేది కాదు'.

'ఎవరికెవరితో ముడిపడుందో, మన చేతుల్లో ఏముంది ?'

'కాని... నా చేతుల్లో ఉన్నది నేను చేయాలనుకుంటున్నాను'.

'అంటే... ' తటాలున భృకుటి ముడేసింది.

'గతాన్ని మరచి మనమిప్పుడు పెళ్ళి చేసుకుందాం. నిన్ను నేనిప్పుడు సంతోషంగా స్వీకరిస్తాను మంజులా !'

'బావా!' విభ్రమంగా చూసింది. 'కాని... నేను నిన్ను స్వీకరించలేను' పళ్ళు బిగబట్టి అదోలా నవ్వింది. ఆ నవ్వును విశ్లేషిస్తే నేనో వెర్రివాడిననే అర్థమొస్తుంది. షాక్ తగిలింది.

వెంటనే తేరుకోలేక పోయాను.

'ఏం... ఎందుకు మంజులా?'

'నిన్ను రెండో భర్తగా స్వీకరించే కంటే... తుచ్ఛమైన శారీరక సుఖాలనుభవించే కంటే... ఓ వీరపత్నిగా... మానసికానందానన్నునుభవించడమెంతో మేలు. నా భర్త గొప్ప దేశభక్తుడు. నా ఆరాధ్యదైవం. నన్నెంతగానో ప్రేమించాడు. పవిత్రమైన దేశరక్షా యజ్ఞంలో సమిధై వీర స్వర్గమలంకరించాడు. భౌతికంగా ఆయన నా కళ్ళ ముందు లేకున్నా, నా కళ్లనిండా, గుండెల నిండా నిండి ఉన్నాడు...'

కొరడాతో ఛెళ్ళున కొట్టినట్టనిపించింది.

'కాని మంజులా... జీవితమంతా...'

'తెలుసు. నా జీవితానికేం ఢోకాలేదు. చచ్చాక నా కోసం ఏడ్చేవాళ్ళుండరని తెలుసు. కాని... సగటు మనిషికి ఇల్లాలినై సుఖాలనుభవించడంలో పరమార్థమేముంది ? త్యాగధనుని విధవగా ఆజన్మాంతం మానసికానందానన్నుభవిస్తాను...' అంటూ లోనికి నడిచింది.

మంజుల ఎంతో ఎదిగిపోయింది. ఆమె ఎదుగుదల ముందు నేనో చీమనైపోయాను.

**19 డిసెంబర్ 1999 ఆదివారం ఆంధ్రభూమి**